# మధ్యమ పురుష

నాగుమల్లి సత్యనారాయణ

నేను రిటైరయి రెండు సంవత్సరాలయింది. పెన్షను వస్తోంది. సికింద్రాబాదుకు చేరువనే వున్న మల్కాజిగిరిలో మా పెద్దబ్బాయి దగ్గరే వుంటున్నాను. ఇంకా వంట్లో ఓపికచావక, ముప్పైసంవత్సరాలుగా అలవడి పోయిన ఉపాధ్యాయవృత్తికి అతుక్కుపోయి, ఏమీ ఉబుసుపోక, సాయంత్రం పదిమంది విద్యార్థులకు ప్రైవేట్లు చెబుతున్నాను. నాకుతెలిసిన వృత్తిలో నేనింకా సంపాదిస్తూనే ఉండడం... ఇంజనీరైన మా పెద్దబ్బాయి మిత్రులను ఆశ్చర్యపరిచింది! "ఈ వయసులో కూడా మీనాన్నగార్ని ఎందుకు కష్టపెట్టడం?" అని వారు మావాడిని ఎన్నో సార్లు ప్రశ్నించడం నేను విన్నాను. దానికి వాడు "నేను ఎంత చెప్పినా నాన్నగారు వినిపించుకోరు. ఐడిల్‌గా కూచుంటే ఆయనకు తోచదంటారు. గ్రామంలో మనం చేసిన వృత్తిని ఇక్కడ సిటీలో చేస్తే తప్పేమిటని వాదిస్తారు. అయినా ట్యూషను ఫీజు సిటీరేటులా కాక, రీజనబుల్‌గా తీసుకుంటారు. ఆర్థిక స్తోమతులేని వాళ్ల పేరెంట్స్‌నుంచి ఫీజు తీసుకోరు. ఆయన పద్ధతికి నేను ఎదురు చెప్పలేను." అని సమాధానం చెప్పేవాడు.

నేను ఉదయం టిఫిను తీసుకొని, పేపరు చదివి, అలాసాయినగర్ మీదుగా నడిచి, మల్కాజిగిరి రైల్వే స్టేషనుకు వెళ్లి, అక్కడే ఓ గంటసేపు కూచుని కాలక్షేపం చేసిరావడం నిత్యకృత్యమైంది.

ఓ రోజున ఇంచుమించు నావయస్సువాడైన ఓ వ్యక్తి రెండు నిండుగావున్న గోనెసంచుల బస్తాలను తీసుకుని సికింద్రాబాదు నుంచి వచ్చే లోకల్ రైలులో ఆ స్టేషనులో దిగాడు. ఆ బస్తాలను రెండింటినీ అవలీలగా రెండు భుజాలమీదికి ఎత్తుకుని టి.సికి టికెట్ ఇచ్చి ప్లాట్‌ఫారం వదలి బయటికి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తిని నేను ఎక్కడో చూశాననిపించింది. అలా అతనిని ఏడెనిమిది పర్యాయములు చూశాను. ఎంత ఆలోచించినా అతనెవరో ఎక్కడచూశానో అతనితోనాకున్న పరిచయం ఏమిటో గుర్తుకు రాకపోగా, ఒకరోజున అతని వెనక నేనూ వెళ్లాను. అతని భుజాల మీద వున్న బరువును చూసి అతన్ని ఆపదలచుకో లేదు. దాదాపు అరగంటసేపు అతని వెనకనే నడిచాను. అతను దయానంద్ నగర్ వరకూ వెళ్లి ఓ ఇంటి ముందు బస్తాలను క్రింద పడేసి తలుపులు తట్టాడు. ముప్పైఏండ్లు లోపువున్న ఓ స్త్రీ తలుపుతెరిచి "మంచినీళ్లు కావాలా మామయ్యా" అని అడిగింది. "ఇటా అమ్మా" అన్నాడతను.

నేను దూరంగా నిలబడి చూస్తున్నాను.

ఆ ఇంటి ముందున్న ఆవరణలో కొబ్బరిపీచు ఆరబెట్టి వుంది.


తాను తెచ్చిన బస్తాలను విప్పి అందులో ఉన్న పీచును కూడా అక్కడ పోసివచ్చి ఆమెఇచ్చిన నీళ్లు తాగి లోనికి వెళ్తూ చెప్పాడతడు "పీచు అంతా నీళ్లలో తడిపి ఆరెయమ్మా. ఈలోగా నేను స్నానం చేసివస్తాను."

"సరే మామయ్యా."

ఆమె అతని కోడలైయుంటుందని అర్థం చేసుకున్నాను.

ఆమె ఒక బకెట్‌తో నీళ్లు తెచ్చి ఆకొబ్బరి పీచును అందులో నానబెట్టి ఆరబెడుతోంది. ఎక్కువసేపు అక్కడ నిలబడితే బాగుండదని, అతనిని ఇంకా నేను గుర్తుపట్ట లేకపోయినందుకు ఆలోచిస్తూనే తిరిగి వెళ్లిపోయాను. ఆ సాయంత్రం ఐదుగంటల వేళ మళ్లీ అక్కడకు వచ్చాను. ఆయనఓపికగా ఓ చాపమీద కూచుని కొబ్బరి పీచుతో తాళ్లునేస్తూ కనిపించాడు. నేను ఆయనను సమీపించి "మీది గుంటూరుజిల్లానేకదండీ?" ప్రశ్నించాను.

ఆయన నాముఖంలోనికి చూసి "అవును బాబూ. గుంటూరుజిల్లాలోని బాపట్లదగ్గర కర్లపాలెం. తమరు... అంటూ చేతిలో నేస్తూన్న తాడును అక్కడ పారేసి లేచి నిలబడ్డాడు.




"మాది బాపట్ల. హైస్కూలులో టీచరుగా చేసి రిటైరయ్యాను. ఇక్కడే మా పెద్దబ్బాయి దగ్గర వుంటున్నాను". నాపేరు చెప్పకుండా, అతను నన్నుగుర్తుపట్టగలడేమోనని నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"నాపేరు మునలయ్యండి. మీరు రమణమూర్తి పంతులుగారు కదూ! నమస్కారమండయ్యా. గుర్తుపట్టలేనందుకు క్షమించండి". అని చేతులు కట్టుకుని నిలబడి, కోడల్ని పిలిచి కుర్చీ తెప్పించి వేసి మంచినీళ్లు ఇప్పించి ఆయనే అన్నాడు "మా ఇద్దరు కుర్రాళ్లు మీదగ్గరే స్కూల్లో చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్దాడు గురువులు విశాఖపట్నంలో ఉంటున్నాడండి. ఇక్కడున్నవాడు రాముడు చిన్నాడండి. రైల్వేలో పని. ఇంకానేపటికి గాని డ్యూటీనుంచి దిగడండి".

మీ చిన్నబ్బాయికి జీతం ఎంత వస్తుంది?"

"వెయ్యి రూపాయలు దాకా వస్తాదనుకుంటాను. తమరి దగ్గర మా అబ్బాయి లిద్దరూ ఎస్సెల్సీలో ప్రైవేట్లు చదువుకున్న విషయం మరిచిపోలేదండి".

"ఆ... అవునవును. గుర్తుకు వచ్చారు. ఆ.... మీకు ఊళ్లో పొలం ఉండాలనుకుంటాను?" మునలయ్య కోడలు తెచ్చి ఇచ్చిన టిఫిన్ ప్లేటును అందుకుంటూ ప్రశ్నించాను.

"నాల్గు సెంట్లు భూమి ఉండేదండి పంతులు గారూ. వీళ్లచదువులకు ఇద్దరాడ పిల్లల పెళ్లిళ్లకు దాన్ని అమ్మేశాను. వ్యవసాయమూ లేదు. కొబ్బరి పీచు వ్యాపారం కూడా అక్కడ సరిగా సాగడం లేదు. అందుకని ఇక్కడకు వచ్చేశాను. ఊరక ఉండలేక, ఏదోశక్తి వున్నంత వరకూ నాలుగు డబ్బులు సంపాదించాలని తాపత్రయపడుతున్నాను. కొబ్బరిపీచుతోతాళ్లునేసి చిల్లర దుకాణాలకు వేస్తున్నాను. బాగానే గిట్టుబాటు అవుతోందండి."

"నిన్ను చూస్తుంటే నాకెంతో ఆనందంగా వుంది మునలయ్యా. ఈవయసులో కూడా ఇంతటి పట్నంలో నీకు తెలిసిన విద్యతో ఎంతోకొంత సంపాదించగలుగుతున్నావంటే, నిన్ను అభినందించకుండా వుండలేక పోతున్నాను. నీలాగే నేనూ ఏమీ ఉబుసుపోక నాకు వచ్చిన వృత్తి నేనూ చేస్తున్నాను. పిల్లలకు ప్రైవేట్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్నాను."

"అలాగాండి పంతులుగారూ! మా మనవడికి మార్కులు సరిగ్గారావడం లేదట. వాడికి కూడా ప్రైవేటు చెప్పి పుణ్యం కట్టుకోండి" అని అర్థించాడు మునలయ్య.


అతని కోడలు తెచ్చిఇచ్చిన టీ తాగుతూ అన్నాను నేను "అదెంతపని పని పది మందిలో నీ మనుమడు ఒకడు. తప్పకుండా చెబుతాను."

మునలయ్య సంతోషంతో లోపలికి వెళ్లి విషయం కోడలికి చెప్పి మనవడిని తీసుకువచ్చి నాకు పరిచయం చేసి అక్కురవాడితో దణ్ణం పెట్టించాడు. అతడు సికింద్రాబాదు సెంటెన్స్ స్కూల్లో సెవెన్త్ క్లాస్ చదువుతున్నట్టు చెప్పాడు. ఆ అబ్బాయిని రేపటి నుంచి సాయంత్రం వేళ, మా అబ్బాయి ఇంటికి పంపమని

అడ్రసు చెప్పాను. వారి ఆర్థిక స్తోమతుబట్టే నాకు ఫీజు ఇవ్వమని చెప్పి ఇంటికి తిరుగు ముఖం పట్టాను.

చీకటి పడుతున్నది.

దయానంద్ నగర్ నుంచి నడిచి వస్తూంటే వారిలో ఓ చిన్న బ్రిడ్జ్‌మీద దాదాపు నావయసు వాళ్ళు, నాకంటె పెద్ద వయసు వాళ్లు— ఓ పదిపన్నెందు మంది తాపీగా కూచుని కిళ్లీలు నములుతూ సిగరెట్లు చుట్టలు కాల్చుతూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కనిపించారు. పిల్లల్ని కని పెంచి పోషించడం —మొగపిల్లలుంటే వృద్ధాప్యంలో... అవసాన కాలంలో... రిటైర్‌మెంట్ స్టేజిలో వాళ్లెలా ఉపయోగపడతారో... ఆ సబ్జక్ట్ మీద తీవ్రంగా వారు చర్చించు కోవడం నాకు అస్పష్టంగా వినవస్తోంది. "అందుకే నండీ, అపుత్రస్య గతిర్నాస్తి అన్నాడు శాస్త్రకారుడు." అంటూ ఓ బొక్కినోరాయన తన లంబోదరం ఊగిసలాడేలా నవ్వుతూ కామెంట్ చేశాడు. పుత్రుల పట్ల, పారాసైట్స్‌గా మారిన ఆ పితృదేవతలను చూసి నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు! ఈ తండ్రులతో నా శిష్యుడైన రాముడి తండ్రి ముసలయ్యను పోల్చుకుని నాలో నేనే గర్వపడ్డాను. "టీచర్స్ ఆర్ ది లీడర్స్ ఆఫ్ ద సొసైటీ" అన్న ఆంగ్ల సామెత నాకు గుర్తొచ్చింది. రోడ్డు ప్రక్కగానున్న పాన్‌షాపులో వక్కపొడి కొనుక్కుని వడివడిగా వచ్చేస్తూంటే, ఎదురుగా వస్తున్న ఓ వ్యక్తి "నమస్కారం మాస్టారూ" అనడం విని ఆగాను. అతని ముఖంలోనికి చూశాను.



అతను రాముడు.

నా విద్యార్థి.

ముసలయ్య కొడుకు.

ఆరు నెలల్రకితం అనుకుంటాను ...


అతను సికింద్రాబాదు రైల్వేస్టేషనులో కనబడి నన్ను గుర్తించి పలకరించాడు. తాను ప్రయోజకుడై రైల్వేలో ఉద్యోగం చేస్తున్నట్టు... నెలకు వెయ్యిరూపాయ లకు పైగా తాను సంపాదిస్తున్నట్టు చెప్పి, నన్ను బలవంతంగా హోటల్‌కు తీసుకు వెళ్లి, నేను తినలేనంత టిఫిన్ పెట్టించాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే — అది తనసంతృప్తి కోసం అన్నాడు. తన తండ్రి తనదగ్గరే వుంటున్నట్టు... అతన్ని తానే పోషిస్తున్నట్టు కూడా చెప్పాడు. నా శిష్యుడి ఔన్నత్యానికి నేనెంతో ఆనందించాను. తాను ఆపరిసర ప్రాంతాలలోనే ఎక్కడో ఉంటున్నట్టుగా చెప్పి, తమ ఇంటికి ఓసారి తప్పక రమ్మని అడ్రసుకూడా చెప్పాడు. అది గుర్తుకు వచ్చి "నువ్వా రామూ! కులాసాయేనా?" ప్రశ్నించాను.

"మీ దయవల్ల బాగానే వున్నాను సార్. ఇంటు ఎక్కడ నుంచి వస్తున్నారు?" అడిగాడు.

"దయానంద్‌నగర్ నుంచి. మీ ఇంటి నుంచే వస్తున్నాను. మీ నాన్న కనబడ్డాడు. నీలాగే నన్నెంతో మర్యాదగా చూశాడు. ఉంటున్నది సిటీలో అయినా ప్రిస్టేజ్ అనుకోకుండా ఇంకా ఈ వయసులో కూడా వళ్లు వంచి పని చేస్తూంటే నేనూ చూసి ఆశ్చర్య పోయాననుకో! మీ నాన్న అందరి తండ్రుల లాంటి వాడూ కాదు. కొడుకు తెచ్చి పెడితె తినికూచునే తత్వం కాదతనిది పాపం! తన కొచ్చిన వృత్తితో ఇంకా తాళ్లు పేనుకుంటూ వేడి నీళ్లకు చన్నీళ్ల తోడన్నట్టు నీకు ఆర్థికంగా సహాయపడుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. ఆ ... మీ అబ్బాయికి నేను ప్రైవేటు చెబుతానని చెప్పాను. రేపటినుంచి సాయంత్రంవేళ నా దగ్గరకు పంపుతూండు. మా అబ్బాయి వుండేది సాయి నగర్ లోని ఎల్లారెడ్డిగారి కాంపౌండులో. ఇంటి నంబరు 1823/3. మరి వస్తానోయ్ రామూ." చెప్పి, ప్రైవేట్లకు టైమవ్వడంతో నేను కంగారుగా వెళ్లిపోయాను.

* * * *

ముసలయ్య మనుమడు నాదగ్గరకు ప్రైవేటుకు వస్తాడని నాలుగు రోజులు ఎదురు చూశాను. కాని




రాలేదు. నేను ఎప్పటిలాగే రోజూ ఉదయం కాలక్షేపం అలా మల్కాజిగిరి రైల్వేస్టేషను వరకూ పోయి అక్కడ కూచుని సికింద్రాబాదు నుంచి వచ్చే లోకల్ ట్రైన్‌లో దిగే ప్రయాణీకులను చూస్తూండేవాడిని. కాని ముసలయ్య మాత్రం కనబడడం లేదు.

ఒక రోజున నేనే ఆయనను కలుసుకుందామనుకుని దయానంద్ నగర్ నడిచి వెళ్లాను. కాని ఆ ఇంటికి తాళం వేసి వుంది. ఆ ప్రక్క ఇంటావిడను అడిగి ఆరాతీయగా నేను తెలుసుకున్నదేమిటంటే—ముసలయ్య చేసే పనేమో కొడుకు నచ్చడం లేదట! తన తండ్రి తాళ్లుపేని డబ్బు సంపాదిస్తున్నట్టుగా తనకు తెలిసిన వాళ్లెవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారని... ఇంత ఉద్యోగం చేస్తూ కూడా తండ్రిని పోషించలేని వాడని అనుకుంటారని, కొడుకు తండ్రిని ఎప్పుడూ కసురుకునేవాడట! తనకు చదువు చెప్పిన మాస్టారు ముందు, తండ్రి తన పరువు తీసే శాడని కొడుకు బాధపడి, తండ్రితో తగవు పెట్టుకుని, తండ్రి చేసే వృత్తిని మాన్పించేసి, దూరంగా వేరే కాలనీకి మకాం మార్చే శాడట!

నా [illegible] పోయింది!

పట్నంలో ఎవరు ఏ వృత్తి చేసినా ఎవరూ పట్టించుకోరు. కులాల ప్రసక్తి లేకుండానే వృత్తి విద్యలను జీవనాధారంగా చేసుకుని బ్రతుకుతుంటారు. ఎవరి వ్యాపకాలు వాళ్లవి... అనుకునే వాడివి అంత వరకూ. కాని ఆ నాటి సంఘటనతో నా మెదడు ఎన్నో ప్రశ్నల సంఘర్షణకు గురైంది. మధ్యతరగతి మనిషి ఆలోచనలు ఎలా వుంటాయో ఊహించుకుంటే — నా శిష్యుడికి నేను బోధించిన విద్యాసంస్కారలోపమా? లేక అభివృద్ధి చెందినదనుకుంటున్న ఈ సంఘంలో తక్కువ సంపాదన నిచ్చే వృత్తిని చేపట్టడం అనేది సంస్కార రహితంగా కనబడడమా? లేక ఒకప్పుడు తక్కువ స్థాయీ పరుడైన మానవుడు, ఆ తరువాత పరిస్థితులు అనుకూలించి ఉన్నత శిఖరాన్ని అధిరోహించినా... అతడు పుట్టిపెరిగిన వాతావరణ పరిసరాలపరిధిలోనే అతని మౌలికమైన ఆలోచనా విధానంకూడా ఎదగకుండా మిగిలిపోతున్నదా? దేనికీ ప్రిస్టేజ్? సామాన్యుడుకూడ ఆర్థికంగా గొప్పవాడు ధనవంతుడు కూడా కాగల అవకాశాలున్న ఈ రోజుల్లో, అతని ప్రగతికి ఈ ప్రిస్టేజ్ ఎందుకు అవరోధం కల్పిస్తోంది? ఏమిటీ మధ్యమ పురుషుడు మనస్తత్వం? — నాలో నేనే ఆలోచనలతో సతమతమైపోతూ తిరుగుముఖం పట్టాను.

(నా గురువులు, పూజ్యులు...
శ్రీ లొల్ల శ్రీరాములు గార్కి — అంకితం...
రచయిత)

